PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 179 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 25 జూన్ 2026

### లైసెన్స్ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని ఎల్ఎస్ఎస్ రాష్ట్ర భవన్ వద్ద మహా నిరసన



3లో

### ఓయూ డాక్టరేట్ అందుకున్న అర్షం దిలీప్ కుమార్




3లో

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

## నిర్లక్ష్యం చేస్తే మార్పు తప్పదని నేతలకుసిఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్!





**నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం**
**పార్టీకోసం పనిచేయని వారిని వదులుకుంటాం**
**బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం**
**సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది**
**జామ్ మీటింగ్‌లో సిఎం రేవంత్ ఘాటు హెచ్చరిక**

**హైదరాబాద్,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఎస్ఐర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. మిగతాది 2లో...

# తుంగభద్ర జలాల్లో అన్యాయం

**కర్ణాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి**
**ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి**
**నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది**
**కర్ణాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు**
**సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ**



**హైదరాబాద్,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. మిగతాది 2లో...

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట...

**ఒకేసారి ఐదు కేసుల కొట్టివేత**
**2019 నాటి కేసుల నుంచి రేవంత్ రెడ్డికి విముక్తి**
**ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో క్లీన్ చిట్**



**హైదరాబాద్,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై నమోదైన ఐదు కేసులను తెలంగాణ ఉన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన ఐదు వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తుది తీర్పును వెలువరించింది. 2లో...

# కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

**రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు**
**కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం**
**జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం**
**సత్తుపల్లి పర్యటనలో కెటిఆర్**




**ఖమ్మం,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మిగతాది 2లో...

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

**కేంద్ర సర్వీసుల నుంచి సొంత కేడర్‌కు వచ్చిన సీనియర్ ఐఏఎస్**
**ఈ నెల 30న ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ విరమణ**
**కేంద్రంతో సమన్వయం కోసమే రేవంత్ రెడ్డి వ్యూహాత్మక ఎంపిక**




**హైదరాబాద్,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం దాదాపు ఖరారైంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయనను తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం రిలీవ్ చేసింది. ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ కాలం జూన్ 30తో మిగతాది 2లో...

## నేడు తుంగభద్ర ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

**నేడు ఒకే వేదికపైకి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు**

**రూ. 51 కోట్ల వ్యయంతో ఆరు నెలల్లో గేట్ల నిర్మాణం పూర్తి**
**2024 వరదల్లో గేటు కొట్టుకుపోవడంతో పటిష్ఠ చర్యలు**
**హోస్పేటలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొననున్న నేతలు**



2లో.



## బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే

**ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు**
**ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం**
**ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం**
**మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల**

**ఖమ్మం,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు.

మిగతాది 2లో...

# సాయికృష్ణది లాకప్ డెత్

**సిట్ నిర్ధారణ.. విజయవాడ కోర్టుకు రిమాండ్ రిపోర్ట్ సమర్పణ**
**సీసీటీవీ ఫుటేజ్ డిలీట్, మృతదేహం మాయం చేశారని వెల్లడి**
**కృష్ణా లంక సీఐ నాగార్జునకు 14 రోజుల రిమాండ్**
**దర్యాప్తునకు సీఐ సహకరించడం లేదని సిట్ ఆరోపణ**



**విజయవాడ,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన విజయవాడ యువకుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు కీలక మలుపు తీసుకుంది. ఇది అదృశ్యం కేసు కాదని, పోలీసు కస్టడీలో జరిగిన మరణం (లాకప్ డెత్) అని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి సస్పెండైన కృష్ణలంక సీఐ నాగరాజుకు మిగతాది 2లో...

# ఏపీలో సువర్ణ అధ్యాయం

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు



**రాయలసీమ రతనాలసీమగా మారబోతోంది**
**జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయి**
**భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుంది**
**శరవేగంగా సీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం**
**గొడ్డలి పార్టీ రాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి**

**కర్నూలు,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైందని.. రాయలసీమ రతనాలసీమగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయన్నారు. 2లో...

# సాయికృష్ణది లాకప్ డెత్

(మొదటి పేజీ తరువాయి)
విజయవాడ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.
సిట్ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పలు కీలక విషయాలను వెల్లడించింది. మే 6న మార్కాపురం నుంచి సాయికృష్ణను అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారని, అక్కడ కస్టడీలో చిత్రహింసల వల్లే అతను మరణించాడని తెలిపింది. తన కొడుకు పోలీస్ స్టేషన్‌లో తీవ్రగాయాలతో, అపస్మారక స్థితిలో కనిపించాడని సాయికృష్ణ తల్లి చెప్పిన విషయాన్ని కూడా సిట్ ప్రస్తావించింది. లాకప్ డెత్‌ను కప్పిపుచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయని సిట్ పేర్కొంది. మే 1 నుంచి జూన్ 1 వరకు పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను ఉద్దేశపూర్వకంగానే డిలీట్ చేశారని నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా, సాయికృష్ణ మృతదేహాన్ని మాయం చేశారని, దాన్ని ఖననం లేదా దహనం చేసేందుకు ప్రయత్నించారని సిట్ తెలిపింది. ఇప్పటికీ మృతదేహం లభ్యం కాలేదని పేర్కొంది. సీఐ నాగరాజు ఉద్దేశపూర్వకంగానే ఆధారాలను నాశనం చేసినట్టు తెలుస్తోందని సిట్ పేర్కొంది. సీఐ నాగరాజు దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని, తప్పుదోవ పట్టించే సమాధానాలు ఇస్తున్నారని సిట్ ఆరోపించింది. సాయికృష్ణను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకుండా అక్రమంగా నిర్బంధించి, హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని కూడా రిపోర్టులో పేర్కొన్నారు.
కాగా, నిన్న 5 గంటల సుదీర్ఘ విచారణ అనంతరం సీఐ నాగరాజును సిట్ అధికారులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఈ క్రమంలో నాగరాజును జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా, జులై 8 వరకు రిమాండ్‌కు తరలించారు. కేసు చాలా సంక్లిష్టంగా ఉందని, దర్యాప్తునకు మరింత సమయం అవసరమని సిట్ కోర్టుకు విన్నవించింది. కేసు దర్యాప్తు నేపథ్యంలో, పోలీస్ శాఖ ఇప్పటికే సీఐ నాగరాజును విధుల నుంచి సస్పెండ్ చేసింది.

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

(మొదటి పేజీ తరువాయి)
ముగియనుండటంతో అదే రోజున సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారని అధికారిక వర్గాల సమాచారం.

**జాజు కెరీర్ ట్రాక్ రికార్డ్ ఇదే!**

1992 బ్యాచ్, తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ జాజు, దాదాపు 13 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. తెలంగాణ కేడర్ అధికారులలో ఇంత ఎక్కువ కాలం కేంద్ర సర్వీసుల్లో పనిచేసిన వారిలో ఆయన ఒకరు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు.
ప్రస్తుత సీఎస్ పదవీ విరమణకు సరిగ్గా వారం రోజుల ముందు ఆయనను సొంత కేడర్‌కు పంపుతూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన నియామకం దాదాపు ఖాయమైంది. "తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు సంజయ్ జాజును ఆయన సొంత కేడర్‌కు తిరిగి పంపేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని" ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా, నాటి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణం కేంద్రంలో ఆయనకున్న విస్తృత అనుభవం, పరిచయాలేనని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖలతో బలమైన సమన్వయం అవసరమని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.
ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, రీజినల్ రింగ్ రోడ్, ప్రతిపాదిత బుల్లెట్ రైలు కారిడార్లు, రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, ఆర్థిక సహకారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో సంజయ్ జాజుకున్న అనుభవం, అక్కడి పనివిధానంపై ఉన్న అవగాహన తెలంగాణకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి విశ్వసిస్తున్నట్లు సమాచారం.
సీఎస్ పదవి కోసం సీనియర్ అధికారులు జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి వారి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, సుదీర్ఘ సర్వీస్ (2028 మార్చి వరకు), కేంద్రంలో ఉన్న నెట్‌వర్క్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చివరికి సంజయ్ జాజును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇక, ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెల 30తో ముగియనుంది. వాస్తవానికి 2025 ఆగస్టులోనే పదవీ విరమణ చేయాల్సి ఉన్నా, ఆయనకు రెండు విడతల్లో మొత్తం 10 నెలల పాటు ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడిగించిన విషయం తెలిసిందే.

# తుంగభద్ర జలాల్లో అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)
కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా?
రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ. 85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణ పేట, కొడంగల్ కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారు. కమిషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసారు. 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట...

(మొదటి పేజీ తరువాయి)
2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. అప్పటి మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున చురుకుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పును ప్రకటిస్తూ, ఐదు కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు చట్టపరంగా ముగింపు పలికినట్లయింది.

## బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే

(మొదటి పేజీ తరువాయి)
బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు తుంగభద్ర ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

**హైదరాబాద్,జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించే కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త జవసత్వాలు రానున్నాయి. ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన స్పిల్‌వే గేట్లను నేడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా పాల్గొంటారు. మూడు రాష్ట్రాలకు చెందిన కీలక నేతల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తం రూ. 51 కోట్ల వ్యయంతో 33 కొత్త స్పిల్‌వే గేట్లను ఏర్పాటు చేశారు. 2024 ఆగస్టులో సంభవించిన వరదల సమయంలో ప్రాజెక్టు 19వ నంబర్ గేటు కొట్టుకుపోయింది. ఇది తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఆ సమయంలో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వంలోని సాంకేతిక బృందం తాత్కాలికంగా స్టాప్-లాక్ గేటును ఏర్పాటు చేసి నీటిని నియంత్రించింది. ఈ ఘటన అనంతరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి ప్రాజెక్టును పరిశీలించింది. భద్రతా కారణాల దృష్ట్యా పాత గేట్లన్నింటినీ తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుల మేరకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు సంయుక్తంగా పనులు చేపట్టాయి. యుద్ధప్రాతిపదికన కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 33 కొత్త గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేశాయి. ఈ కొత్త గేట్ల ఏర్పాటుతో వరదల సమయంలో నీటి ప్రవాహాన్ని మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని, నీటి వృథాను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. రాయలసీమకు జీవనాడిగా భావించే ఈ ప్రాజెక్టు ద్వారా కుడి ప్రధాన కాలువ కింద కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సుమారు 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. అనేక గ్రామాలకు తాగునీటి అవసరాలు కూడా ఈ ప్రాజెక్టు తీరుస్తోంది. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం నేతలందరూ హొస్పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

# ఏపీలో సువర్ణ అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)
గతంలో జొన్నగిరిని స్వర్ణగిరిగా పిలిచేవారని.. మన దగ్గర కూడా బంగారం ఉత్పత్తి కాబోతోందని తెలిపారు. భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుందని వెల్లడించారు. ఒకప్పుడు కెజిఎఫ్... ఇప్పుడు జెజిఎఫ్ అని ముఖ్యమంత్రి అన్నారు. చమురు తర్వాత దేశంలో ఎక్కువ దిగుమతి అయ్యేది బంగారమే అని తెలిపారు. రాయలసీమలో సిరులు పండించేందుకు శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్‌లో 1000 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. రెండో యూనిట్‌తో కలిపి 50 టన్నుల బంగారం ఉత్పత్తి అవుతుందన్నారు. ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని.. త్వరలో మరో 1500 మందికి ఉపాధి లభించనుందన్నారు. భవిష్యత్‌లో 5 వేల మందికి స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌లో ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని అన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం అని అన్నారు. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. కులమతాల పేరుతో గొడ్డలి పార్టీ విషం చిమ్ముతోందన్నారు. నేరాలు, ఘోరాలు చేసి రాజకీయ రంగు పులుముతున్నారన్ని ÷ర్ అయ్యారు. రప్పా రప్పా రాజకీయం తప్ప గొడ్డలి పార్టీ చేసిందేమీలేదన్నారు. మళ్లీ వస్తాం.. గొడ్డలితో రప్పా రప్పా ఆడిస్తామంటున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌ఫోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# లైసెన్స్ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని ఎల్ఎస్ఎస్ రాష్ట్ర భవన్ వద్ద మహా నిరసన

**కమిషన్ విధానం రద్దు చేసి నెలకు రూ.30 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్**




**హైదరాబాద్, ప్రతినిధి జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** లైసెన్స్ సర్వేయర్ల సమస్యల పరిష్కారం కోసం ఎల్ఎస్ఎస్ రాష్ట్ర భవన్ వద్ద నిర్వహించిన మహా నిరసన కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి భారీ సంఖ్యలో లైసెన్స్ సర్వేయర్లు తరలివచ్చారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో సర్వేయర్లు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా లైసెన్స్ సర్వేయర్లు మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న కమిషన్ విధానాన్ని రద్దు చేసి, ప్రతినెలా రూ.30 వేల గౌరవ వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అలాగే తమకు సంబంధించిన ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్వేయర్ల ప్రతినిధులు డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి జేడీ మేడం గారిని కలిసి తమ సమస్యలను వివరించారు. సర్వేయర్ల ఇబ్బందులపై సానుకూలంగా స్పందించిన ఆమె, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, రాబోయే రోజుల్లో సర్వేయర్లకు శుభవార్త అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లైసెన్స్ సర్వేయర్ల సంఘం అధ్యక్షులు విక్రమ్ వర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, వైస్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణరావు, ట్రెజరర్ కబీర్ దాస్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న లైసెన్స్ సర్వేయర్లు పాల్గొని సంఘీభావం తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని సంఘం నాయకులు స్పష్టం చేశారు.

# ఓయూ డాక్టరేట్ అందుకున్న అర్షం దిలీప్ కుమార్




**హనుమకొండ, జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ నుంచి అర్షం దిలీప్ కుమార్ పిహెచ్‌డి (డాక్టరేట్) సాధించారు. ఓయూ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం హెడ్ ప్రొఫెసర్ పి. విష్ణుదేవ్ పర్యవేక్షణలో ఆయన తన పరిశోధనను పూర్తి చేశారు. పరిశోధనా అంశం "ఎంపవర్మెంట్ ఆఫ్ విడోస్ త్రూ నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్ ఏ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్" (సభ్యేతర సంస్థల ద్వారా వితంతువుల సాధికారత వరంగల్ జిల్లాపై ఒక అధ్యయనం) అనే అంశంపై దిలీప్ కుమార్ సమర్పించిన పరిశోధనా వ్యాసానికి గాను ఓయూ పరీక్షల విభాగం ఆయనకు డాక్టరేట్‌ను ప్రకటించింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన అర్షం దిలీప్ కుమార్ ప్రస్తుతం ఢిల్లీలోని ప్రముఖ వల్లభాయ్ పటేల్ చెస్ట్ ఇన్స్టిట్యూట్ సోషల్ వర్క్ విభాగంలో ఫీల్డ్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్నారు. గ్రామానికి చెందిన యువకుడు ఉన్నత విద్యాభ్యాసంలో రాణించి డాక్టరేట్ సాధించడం పట్ల నీరుకుల్ల గ్రామస్తులు, మిత్రులు, పలువురు సామాజిక కార్యకర్తలు (సోషల్ వర్కర్లు) ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# 13వ డివిజన్ మార్కండేయనగర్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం..









**1వ డివిజన్ బృందావన్ కాలనీలో రూ.29.70 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

**కరీంనగర్ జిల్లా జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగర అభివృద్ధిలో భాగంగా నగరంలోని 13వ డివిజన్ మార్కండేయనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో మలయప్ప ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మరియు యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నగరంలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ తేళ్ల లక్ష్మి రమేష్, మున్సిపల్ అధికారులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని 1వ డివిజన్ బృందావన్ కాలనీలో రూ.29.70 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ భారి అపర్ణ జితేందర్, డీఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ



**హైదరాబాద్, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణ పథకం ద్వారా 36వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా 100కు పైగా వివిధ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ. వెంకట్ రెడ్డి తెలిపారు. ఆన్ లైన్ ఈ లెర్నింగ్ ద్వారా కోర్స్ పూర్తిచేసిన యువతకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించే నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేటి సమాజంలో పేద, మధ్యతరగతి విద్యార్థిని విదార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు అత్యధిక జీత భత్యాలు, ఉద్యోగ అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో ఆన్లైన్ శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కంప్యూటర్ సాఫ్ట్వేర్ శిక్షణ రంగంలో 34 సంవత్సరాల అనుభవం గల పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి 100 కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా ఆన్ లైన్ ఈ-లెర్నింగ్ ద్వారా శిక్షణను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణా పథకం ద్వారా రూ.1,50,000 వరకు కోర్స్ ఫీజులు గల వివిధ లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా నేర్చుకొని సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పొందాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థినీ విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు జూలై 31వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.pacecomputers.org వివరాలకు ఫోన్: 9505800047

# "91 లక్షల ధాన్యం కుంభకోణంలో బిఆర్ఎస్ నాయకులు చల్మెడ అనుచరుడి అల్లుడి హస్తం"

**కుంభకోణంలో ప్రధాన పాత్ర చల్మెడ ప్రధాన అనుచరుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాడిశెట్టి ఆనందం అల్లుడు మధుకర్**



**వేములవాడ, జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన రూ.91 లక్షల ధాన్యం కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ, ధాన్యం కుంభకోణం కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలని ఆది శ్రీనివాస్ స్వయంగా అధికారులకు పూర్తి స్వేచ్ఛ కల్పించారని తెలిపారు. విచారణలో భాగంగా 13 లారీల ధాన్యంలో 10 లారీలను సిద్ధిపేట, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు విక్రయించిన వ్యక్తిగా చేపూరి మధుకర్ పేరు వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. చేపూరి మధుకర్ రుద్రంగి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాడిశెట్టి ఆనందం అల్లుడు అని, మాడిశెట్టి ఆనందం బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావుకు అత్యంత సన్నిహితుడు అని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ధాన్యం కుంభకోణంలో చల్మెడ పాత్ర ఉందా అనే విషయంపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆది శ్రీనివాస్‌పై రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షించే విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడలేదని తెలిపారు. దోషులుగా తేలిన వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో రాజన్న ఆలయం అభివృద్ధి, కళికోట, సూరమ్మ చెరువు, మరిపల్లి ప్రాజెక్టు తదితర అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, వాటిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. జిల్లాలో రైతుల ప్రయోజనాల కోసం పలు మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా వారు గుర్తుచేశారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలకు తగిన సమాధానం ఇస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన సర్పంచ్ : మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్



**రామడుగు జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని కొరటపెల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ ఎన్జిఆర్ఎస్ నిధుల ద్వారా గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం 10 లక్షల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామము అభివృద్ధి కోసం అనేక నిధులు తెచ్చి గ్రామంన్నీ అభివృద్ధి చేస్తామని, గ్రామ అభివృద్ధి కోసమే మేము కష్టపడుతామని గ్రామాన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయితీ గా పేరు తీసుకరవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకరవలని, వాటిని పరిష్కరించే విధంగా పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఎన్జిఆర్ఎస్ నిధుల కేటాయింపు పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు మరయు యువకులు తదితరులు పాల్గొన్నారు



# త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి అభినందన సత్కారం



**హైదరాబాద్, జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి తన పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ సీనియర్ నేత వై. కృష్ణ, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు ల నేతృత్వంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను బహుకరించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ప్రయోజన పథకాలు, సామాజిక అభివృద్ధి, తదితర అంశాలపై వారు గవర్నర్ తో చర్చించారు.

# మానకొండూర్‌ను 'మాదకద్రవ్య రహిత మండలం'గా మారుద్దాం



**మానకొండూరు, జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** యువతను, విద్యార్థులను మాదకద్రవ్యాల మహమ్మారి నుండి రక్షించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో మానకొండూరు మండలంలోని ఊటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. భారత ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" (వ్యసన రహిత భారత్) వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల మాదకద్రవ్యాల వినియోగం పట్ల ఆకర్షితులయ్యే ప్రమాదం పెరిగిందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలే తప్ప, వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, విద్యార్థుల బంగారు భవిష్యత్తుఅంధకారమవుతుందని హెచ్చరించారు. జూన్ 17 నుండి 26 వరకు జరుగుతున్న ఈ అవగాహన వారోత్సవాల్లో భాగంగా, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు. మాదకద్రవ్య రహిత మానకొండూర్" లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలు, చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రమాదేవి, మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులందరూ వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడతామని, సమాజంలో చైతన్యం తీసుకువస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# నూతన వధూవరులు ఆశీర్వదించిన మున్నూరుకాపు ప్రముఖులు







**ముదిగొండ, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముదిగొండ మండలం వనం వారి కిష్టాపురంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నర్సింహారావుపేట గ్రామానికి చెందిన సుంకర వెంకటప్పయ్యవెంకటమ్మ దంపతుల ఏకైక కుమారుడు సతీష్‌తో, కాశి నర్సింహారావు (లేట్)స్వప్న దంపతుల ఏకైక కుమార్తె ఉషశ్రీ వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. కుటుంబ శ్రేయోభిలాషుల సమక్షంలో జరిగిన ఈ వివాహ కార్యక్రమానికి మున్నూరుకాపు సంఘం ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ప్రముఖులు పొదిల రవి కుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, కార్యదర్శి పసుపులేటి దేవేందర్, ఆకుతోట శేఖర్, హైకోర్టు అడ్వకేట్ చెరుకూరి శేషగిరిరావు, గడీల నర్సింహారావు, గడీల మధుకుమార్, వాకటి రమేష్, చౌడం నర్సింహారావు, వనం శ్రీనివాసరావు, ఆకుల సురేష్ తదితరులు వివాహ వేడుకకు హాజరై వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

# దయచేసి డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకండి..

## వర్షాలొస్తే డ్రైనేజీ వ్యవస్థతో ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది..

## కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు







**కరీంనగర్ టౌన్ జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణ ప్రజలు, ముఖ్యంగా 50వ డివిజన్ (జ్యోతి నగర్) వాసులు , డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడం మానుకోవాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయడం వల్ల పూర్తిగా డ్రైనేజీ వ్యవస్థ స్తంభించిపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు రోజుల్లో జ్యోతినగర్ డ్రైనేజీల నుండి ఇప్పటివరకు 5 ట్రాక్టర్ల చెత్తాచెదారంను తొలగించడం జరిగిందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేసే పనులను ముమ్మరం చేసినట్లు కార్పొరేటర్ ప్రవీణ్ రావు తెలిపారు. ఈ క్రమంలో జ్యోతినగర్, కెమిస్ట్రీ భవన్ రోడ్డు, పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీలను పరిశీలించగా, ప్లాస్టిక్ వ్యర్థాలతో, చెత్తా చెదారంతో నీరు ప్రవహించకుండా పూర్తిగా అడ్డుపడిందనే విషయాన్ని గుర్తించి, ప్రధానంగా డ్రైనేజీల్లో భారీ ఎత్తున పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలోనీ డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో, వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు రోడ్ల మీదికి వచ్చే ప్రమాదం ఉందన్నారు.. డ్రైనేజీలలో పేరుకుపోయిన ఈ చెత్త, వ్యర్థాల వల్ల క్రిమి కీటకాలు దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు."డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని, అపరిశుభ్రత వల్ల వచ్చే రోగాలు మన కుటుంబాలనే ఇబ్బంది పెడతాయన్నారు. దయచేసి ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలనీ, చెత్తను డ్రైనేజీలలో వేయకుండా, మున్సిపాలిటీ కేటాయించిన స్థలంలో(డస్ట్ బిన్) వేయాలని, చెత్త చెదారంను ట్రాక్టర్లకు అందించాలని, పరిశుభ్రమైన పరిసరాలు, వాతావరణం కోసం సౌకర్యవంతమైన జీవనానికి డివిజన్ ప్రజలు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కార్పొరేటర్ ప్రవీణ్ రావు కోరారు.

# వాసవి కపుల్స్ క్లబ్, కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమాలు

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ మరియు మెరిట్ విద్యార్థులకు సన్మానం








**కరీంనగర్ జిల్లా జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** వాసవి కపుల్స్ క్లబ్, కరీంనగర్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ సారథ్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగాయి. కోతీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్లబ్ సభ్యులు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలోని మెరిట్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. అనంతరం, గాంధీ రోడ్ మార్కెట్ కమిటీ వద్ద ఉన్న అనాథ శరణాలయానికి మరియు వికలాంగుల సేవా కేంద్రానికి అవసరమైన మెడికల్ కిట్లను క్లబ్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ స్పాన్సర్ చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆర్.సి. గాయిత్రి, జెడ్.సి. మునిందర్, జనరల్ సెక్రటరీ పోచమల విజయ్, పైడా రవి, విశ్వనాథం మరియు క్లబ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు. సమాజ శ్రేయస్సు కోసం, విద్యార్థుల ప్రోత్సాహం కోసం తమ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ తెలిపారు.

# ఎల్పీజీ వినియోగదారులు జూన్ 30లోపు eKYC పూర్తి చేయాలి



కలెక్టర్(పౌరసరఫరాలు) వారి కార్యాలయం,
కరీంనగర్
తేది:23-6-2026

పత్రికా ప్రకటన

ఇందు మూలముగా సమస్త గృహ సంబంధమైన LPG గ్యాస్ వినియోగదారులకు తెలియజేయడం ఏమనగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ఫర్ ఎల్.పి.జి (డిబిటిఎల్-పహల్) మరియు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) పథకాల పరిధిలోకి వచ్చే ఎల్.పి.జి వినియోగదారుల బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ (బిఎఎ) ను పూర్తి చేయాలని భారత ప్రభుత్వ పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ అన్ని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసిలకు) ఆదేశాలు జారీ చేసినట్లు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ తెలియజేశారు.

జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, ఎల్‌పిజి కనెక్షన్ పొందినప్పటి నుండి ఇప్పటి వరకు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ చేయించుకోని గృహ వినియోగదారులందరూ 30.06.2026 లోపు బిఎఎను పూర్తి చేయవలసి ఉంటుంది.

కావున గృహ సంబంధమైన LPG గ్యాస్ వినియోగదారులను కోరునది ఏమనగా, సంబంధిత గ్యాస్ ఏజెన్సీలో గాని లేదా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ అప్ప్ ద్వారా **ఉచితముగా** తేది: 30.06.2026 లోపు eKYC పూర్తి చేయవలసినదిగా కోరుచున్నము.

కలెక్టర్ (పౌరసరఫరాలు),
కరీంనగర్

శ్రీయుత జిల్లా పౌర సంబంధాల అధికారి, కరీంనగర్ వారికి – ఇట్టి పత్రిక ప్రకటనను అన్ని పత్రికలలో ప్రచురించగలరని కోరుచున్నము.

**కరీంనగర్ జిల్లా జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** గృహ సంబంధిత ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ (దీూూూ) మరియు వఖ్జ ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ సూచించింది.భారత ప్రభుత్వ పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ఫర్ ఎల్పీజీ (DBTLPAHAL) మరియు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (PMUY) పథకాల పరిధిలో ఉన్న వినియోగదారులు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఎల్పీజీ కనెక్షన్ పొందినప్పటి నుంచి ఇప్పటివరకు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ చేయించుకోని వినియోగదారులు తమ సంబంధిత గ్యాస్ ఏజెన్సీలలో లేదా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా ఉచితంగా eKYC పూర్తి చేసుకోవాలని సూచించారు.అర్హులైన వినియోగదారులు జూన్ 30, 2026లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిరంతరంగా పొందాలని కలెక్టర్ (పౌర సరఫరాలు) కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

# విద్యార్థులకు లాప్టాప్‌లు అందజేసిన కేటీఆర్





**సత్తుపల్లి, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అవగాహన సదస్సు కు ముఖ్యఅతిథిగా సత్తుపల్లి కి వచ్చిన కేటీఆర్ అదే వేదికపై ఇద్దరు పేద విద్యార్థులకు లాప్టాప్ అందజేశారు. పెనుబల్లి మండలం కరాలపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి వెంకటకృష్ణ కల్లూరు పట్టణానికి చెందిన ఇద్దరు పేద విద్యార్థులు ల్యాప్టాప్ లు కొనుక్కోలేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని వారికి సత్తుపల్లి రానున్న కేటీఆర్ చేతుల మీదుగా అందించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కోరారు. సందర్భంగా బుధవారం కేటీఆర్ కార్యక్రమంలో కల్లూరు పట్టణానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు దీక్షిత్ నాయక్, అఫ్రోస్ సమీనా లకు కేటీఆర్ చేతుల మీదుగా ల్యాప్టాప్లు అందజేశారు.



# పారదర్శక ఓటరు జాబితా కోసం అందరి సహకారం అవసరం: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హనుమకొండ, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితాను మరింత ప్రామాణికంగా, పారదర్శకంగా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమానికి ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా సహకరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా అవగాహన సమావేశంలో కలెక్టర్ ఎస్ఐఆర్–2026 అమలు విధానం, ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఓటర్ల బాధ్యతలపై సమగ్ర వివరాలు వెల్లడించారు. ప్రజలకు సరైన సమాచారం చేరవేసే విషయంలో మీడియా కీలక పాత్ర పోషించాలని, ఎస్ఐఆర్‌పై ఉన్న అపోహలు, అనుమానాలను తొలగించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో నిర్వహించిన ముందస్తు ఎస్ఐఆర్ ప్రక్రియ సానుకూల ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. వరంగల్ పశ్చిమలో 68 శాతం, పరకాల నియోజకవర్గంలో 87 శాతం మేర మ్యాపింగ్ పూర్తయిందని వెల్లడించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు హౌస్–టు–హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందజేసి, ఇంట్లో లేని వారిని కనీసం మూడు సార్లు సందర్శించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. 2002 ఓటరు జాబితాలో ఉన్న అర్హులైన



ఓటర్లకు ఈ దశలో అదనపు పత్రాలు అవసరం లేదని, వివరాలను ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. జూలై 31న విడుదలయ్యే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉండే అవకాశం ఉన్నందున ఫారమ్‌ల పంపిణీ, సేకరణను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. అర్బన్ ప్రాంతాల్లో షిఫ్టెడ్ ఓటర్లు, అద్దె నివాసితులు, కొత్తగా వచ్చిన వారి వివరాలను నమోదు చేసి, అవసరమైతే ఫారమ్–8 ద్వారా బదిలీ చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులందరికీ ఫారమ్–6 అందించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. మరణించిన వ్యక్తులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లు, బహుళ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి నిబంధనల ప్రకారం సవరిస్తామని చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు నమోదు కావడం లేదా తప్పుడు వివరాలు సమర్పించడం చట్టవిరుద్ధమని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసీఐ సెక్షన్–31 ప్రకారం రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉండటం నేరమని, అలాంటి వారికి ఏడాది వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 1800 425 1126 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు వెల్లడిం చారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్–2026 ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే కార్యక్రమం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్ఓ కె. శ్రీనివాస్, డీపీఆర్ఓ అయూబ్ అలీ, ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్ల సుడా నిధులతో హెలిప్యాడ్, రోడ్డు, పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**కరీంనగర్, జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** రూ.2 కోట్ల సుడా నిధులతో కలెక్టరేట్ వెనుక ఉన్న పాత హెలిప్యాడ్ పార్కులో నూతన హెలిప్యాడ్ నిర్మాణం, నూతన కలెక్టరేట్‌కు ఉత్తర భాగంలో సీసీ రోడ్డు నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. సుడా చైర్మన్ గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, కలెక్టర్ చిత్రా మిశ్రా, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నగర సుందరీకరణకు ఈ అభివృద్ధి పనులు దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# కరీంనగర్ జిల్లాలో కారు గుర్తు సునామీ ఖాయం: కేటీఆర్




**హైదరాబాద్, జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కారు గుర్తుదే విజయం సాధిస్తుందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అనాదిగా బీఆర్ఎస్‌కు కంచుకోటగా నిలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామ రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితులు, సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమన్వయం, రానున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మరియు ముఖ్య నాయకులకు పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని సమకాలీన రాజకీయ పరిస్థితులపై కూడా నాయకులతో ఆయన విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్‌కు బలమైన ప్రజా మద్దతు కొనసాగుతోందని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కారు గుర్తు సునామీ ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# రోడ్లపై సంచరిస్తున్న పశువులతో ప్రయాణికులకు ప్రాణహాని

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై పైడిపాల వెంకటేశ్వర్లు ఆగ్రహం

**పరకాల, జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):**

పరకాల పట్టణంలో రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పైడిపాల వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధి గురించి మాట్లాడుతున్న మున్సిపాలిటీ అధికారులు, ప్రజల భద్రతకు సంబంధించిన కీలక అంశాలను విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో పెద్ద సంఖ్యలో పశువులు



గుంపులుగా తిరుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. గతంలో పశువుల కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పటికీ, అధికారులు తగిన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఇటీవల ఒక ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న భార్యాభర్తల ముందుకు రెండు పశువులు ఒక్కసారిగా కొట్టుకుంటూ రోడ్డుపైకి దూసుకురావడంతో తృటిలో ప్రమాదం తప్పిందని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని, పశువుల యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పైడిపోలు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

# జర్నలిస్టులకు న్యాయం చేయండి..

## కేటీఆర్‌కు సత్తుపల్లి జర్నలిస్టుల వినతి

## నియోజకవర్గ ఇన్‌ఛార్జీల హోదా తగ్గించి మండల అక్రిడేషన్ కార్డులు జారీ చేయడం అన్యాయం

## ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి సహకరించాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను కోరిన విలేకరులు



**సత్తుపల్లి, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రింట్ మీడియా జర్నలిస్టుల హోదాను తగ్గిస్తూ మండల స్థాయి అక్రిడేషన్ కార్డులు జారీ చేయడంపై సత్తుపల్లి నియోజకవర్గ జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల తర్వాత తొలిసారిగా జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తున్నప్పటికీ, గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్‌సీ (నియోజకవర్గ ఇన్‌ఛార్జీ) జర్నలిస్టుల హోదాను తగ్గించి మండల అక్రిడేషన్ కార్డులు జారీ చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నియోజకవర్గ కేంద్రాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు వారి విధులకు అనుగుణంగా అక్రిడేషన్ కార్డులు జారీ చేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జీలను మండల స్థాయికి పరిమితం చేస్తూ వారి హోదాను తగ్గించిందని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడేషన్ కార్డులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులకు లభించాల్సిన జిల్లా బస్సు పాసుల విషయంలో కూడా ప్రభుత్వం పరిమితులు విధించి హోదాను తగ్గించిందని వారు వివరించారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతూ పలుమార్లు విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ప్రస్తుతం అమలవుతున్న విధానాలు జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగానే నియోజకవర్గ కేంద్రాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు వారి హోదాకు అనుగుణంగా అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసులు మంజూరు చేయించేలా తమ పార్టీ తరఫున సహకరించాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను కోరారు. జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు జర్నలిస్టు ప్రతినిధులు తెలిపారు.

# ప్రధాన మంత్రి స్వనిధి పథకం గడువు 2030 వరకు పొడిగింపు



## చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి : నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్ జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** తెల్లవారుజామున కూరగాయలు విక్రయించే వారి నుండి రాత్రివేళ టిఫిన్ బండ్లు నిర్వహించే వారివరకు ప్రజల రోజువారీ అవసరాలను తీర్చేందుకు శ్రమిస్తున్న వీధి వ్యాపారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి స్వనిధి (PM SVANidhi) పథకం గడువును 2030 మార్చి 31 వరకు పొడిగించడం అభినందనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా స్వయం ఉపాధిని బలోపేతం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత విస్తరించిందన్నారు. ఎలాంటి గ్యారెంటీ అవసరం లేకుండా బ్యాంకుల ద్వారా అందించే రుణాల పరిమితిని కూడా పెంచినట్లు తెలిపారు. మొదటిసారి రుణం పొందే లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.10,000 అందించగా, ప్రస్తుతం దానిని రూ.15,000కు పెంచారని చెప్పారు. మొదటి రుణాన్ని సకాలంలో చెల్లించిన వారికి రెండో విడతలో రూ.20,000 స్థానంలో రూ.25,000 రుణం అందజేస్తారని వివరించారు. రెండో రుణాన్ని కూడా క్రమం తప్పకుండా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50,000 వరకు రుణం మంజూరు చేసి వ్యాపార విస్తరణకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. రెండో రుణాన్ని సక్రమంగా చెల్లించిన వారికి రూ.10,000 నుంచి రూ.30,000 వరకు పరిమితి గల యూపీఐ క్రెడిట్ కార్డును కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 75.5 లక్షల మంది వీధి వ్యాపారులు లబ్ధి పొందారని, సుమారు రూ.17,800 కోట్ల రుణాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. వీరిలో సగానికి పైగా మహిళలు ఉండటం విశేషమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఈ పథకం అమలులో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7.68 లక్షల రుణాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. వీరిలో 4.44 లక్షల మంది మొదటి విడత, 2.35 లక్షల మంది రెండో విడత, 88 వేల మందికి పైగా మూడో విడత రుణాలు పొందుతూ తమ వ్యాపారాలను విజయవంతంగా అభివృద్ధి చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ అద్భుత అవకాశాన్ని కరీంనగర్ నగరంలోని ప్రతి చిరు వ్యాపారి సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ సువార్త, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు చిరు వ్యాపారులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ పై విస్తృత అవగాహన కల్పించాలి

**- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహణ**

**- డూప్లికేట్ ఓటర్ల గుర్తింపునకు ఈఆర్‌వో నెట్ ద్వారా ప్రత్యేక పరిశీలన**

**- ఎస్ఐఆర్‌పై పాత్రికేయుల సందేహాలన్నింటికీ సమాధానాలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) శిక్షణలు నిర్వహించడంతో పాటు అవసరమైన పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారంలు రెండు అందజేస్తారని తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం నింపి తిరిగి ఒక ఫారం బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ప్రతి ఇంటిని బీఎల్‌వోలు మూడు సార్లు సందర్శిస్తారని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి వివరాలను సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు.బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయపడతారని, ఇంటింటి సర్వే సమయంలో బీఎల్‌ఏలు బీఎల్‌వోలతో కలిసి వెళ్లవచ్చని తెలిపారు. బీఎల్‌వోలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించగా, బీఎల్‌ఏలు తమ రాజకీయ పార్టీలు జారీ చేసిన గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని సూచించారు. విదేశాల్లో, ఇతర నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, సైన్యంలో విధులు నిర్వహిస్తున్న ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని, లేదా వారి కుటుంబ సభ్యులు సంబంధిత బీఎల్‌వోకు వివరాలు అందించవచ్చని తెలిపారు.జూలై 31న ముసాయిదా ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఓటరు పేరు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలపై ఆగస్టు 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలను సెప్టెంబర్ 28, 2026 నాటికి పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో వివరించే ట్యుటోరియల్ వీడియోలను సిద్ధం చేశామని, ఫారాలతో పాటు వివరణాత్మక కరపత్రాలను కూడా అందజేస్తామని తెలిపారు. మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లు కూడా తప్పని సరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని స్పష్టం చేశారు. మ్యాపింగ్ అనేది కేవలం ప్రీ-ఎస్ఐఆర్ ప్రక్రియ మాత్రమేనని, ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేయడానికే అది ఉపయోగమని, అది ఫారానికి ప్రత్యామ్నాయం కాదని అన్నారు. 2002 ఎస్ఐఆర్ జాబితాలో దేశంలోని ఎక్కడైనా ఓటు నమోదై ఉన్నట్లయితే ఆ వివరాలను ప్రస్తుతం ఇవ్వవచ్చని తెలిపారు. ముఖ్యంగా వివాహానంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలకు ఈ అవకాశం ఉపయోగపడుతుందని అన్నారు. 2002 ఎస్ఐఆర్ ఓటు ఆధారంగా ఆరుగురు కుటుంబ సభ్యులను అనుసంధానం చేయవచ్చని వివరించారు. డూప్లికేట్ ఓటర్లను గుర్తించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఒకే పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు వంటి వివరాలతో ఉన్న డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను గుర్తించి, బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ తాజా సమాచారం అందిస్తున్నామని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి సందేహానికి సమాధానం ఇవ్వబడుతుందని తెలిపారు.స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఇది ఎనిమిదవ ఎస్ఐఆర్ కార్యక్రమమని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగించి ఓటరు జాబితాను క్లియర్ గా ఉంచేందుకు ఎస్ఐఆర్ ఉపయోగపడుతుందని వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి వివక్ష ఉండదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని వారి పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో ఉండవని స్పష్టంచేశారు. ఫారం సమర్పించిన ఓటరు పేరును నిబంధనల ప్రకారం తొలగించబోమని వెల్లడించారు.అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివిధ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ తిరిగొస్తేనే ఖమ్మం జిల్లాకు న్యాయం

**రైతులను, మహిళలను, నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసింది**

**మాజీ మంత్రి కేటీఆర్**

**సత్తుపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఘాటు వ్యాఖ్యలు**












**సత్తుపల్లి, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ఎక్కడికి వెళ్లినా ఈ దుర్మార్గ పాలన పోవాలి మళ్లీ కేసీఆర్ పాలన రావాలి అనే స్వరం వినిపిస్తోందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప తేడాతో కల్లూరు, సత్తుపల్లిలో ఓడిపోయామని, అయితే ప్రజల్లో ఇప్పటికీ బీఆర్ఎస్ పట్ల ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. కేసీఆర్ ఇచ్చిన హెచ్చరికలను ప్రజలు పెడచెవిన పెట్టడం వల్లే నేడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు.మోసపడితే గోసపడతారు అని ఆనాడే కేసీఆర్ చెప్పారని, ఇప్పుడు కాంగ్రెస్ హామీలను నమ్మిన ప్రజలు గోసపడుతున్నారని కేటీఆర్ అన్నారు. మీరు వద్దనుకుంటే నేను రాజకీయాలకు విశ్రాంతి తీసుకుంటానని బాహాటంగా ప్రకటించిన వ్యక్తి కేసీఆర్ అని, 46 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు, విజయాలు, పరాజయాలు చూసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఒక్క ప్రధానమంత్రి పదవి తప్పితే అన్ని కీలక పదవుల్లో పనిచేసిన రాజకీయ దిగ్గజం కేసీఆర్ అని కొనియాడారు.రైతు నుంచి పైసలు వసూలు చేసిన ప్రభుత్వాలు దేశంలో ఎన్నో ఉన్నాయని, కానీ 2014 తర్వాత రైతుకు పెట్టుబడి సాయం చేయాలనే ఆలోచన చేసిన తొలి నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. 76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు ద్వారా రూ.73 వేల కోట్లకు పైగా జమ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పేర్లు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏమి చేసిందని ప్రశ్నించినారు. కేసీఆర్ హయాంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టామని గుర్తుచేశారు. రూ.10 వేల కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వమే దాదాపు రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు.ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రభుత్వంలో ఉన్నప్పటికీ జిల్లాకు ఒరిగిందేమిటని ప్రశ్నించారు. రైతు భరోసా లేదు, పూర్తి స్థాయి రుణమాఫీ లేదు, ధాన్యం కొనుగోళ్లు లేవు, గన్నీ బ్యాగులు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.రెండు లక్షల రుణమాఫీకి ఒకరు రూ.50 వేల కోట్లు, మరొకరు రూ.40 వేల కోట్లు అవసరమని చెప్పారని, బడ్జెట్ సమావేశాలకు వచ్చే సరికి రూ.26 వేల కోట్లతో సరిపెడుతున్నారని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని చెబుతున్నారని, అయితే ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రామ్ రామ్ చెప్పేస్తారని కేసీఆర్ ముందే చెప్పారని, ప్రస్తుతం అదే జరుగుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రైతుబంధు గుర్తుకొస్తుందని, ఇప్పటికే మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారని ఆరోపించారు. మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. ఐదు లక్షల రూపాయల విద్యా భరోసా కార్డులు ఇస్తామని చెప్పి విద్యార్థులను మోసం చేశారని, రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్యపెట్టారని అన్నారు.మహిళలకు ప్రతి నెలా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, రాష్ట్రంలోని మహిళల ఖాతాల్లో కాంగ్రెస్ ఎగ్గొట్టిన రూ.1.5 లక్షల చొప్పున జమ చేస్తే తాను శాశ్వతంగా రాజకీయాలు వదిలేస్తానని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ అప్పులు చేశారని విమర్శిస్తోందని, కానీ ఈ రెండున్నర సంవత్సరాల్లోనే నాలుగు లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పులు చేసిందని ఆరోపించారు. కేసీఆర్ అప్పులు చేసి ప్రాజెక్టులు కట్టారని, 24 గంటల కరెంట్ ఇచ్చారని, పెన్షన్లు పెంచారని, గురుకులాలు ఏర్పాటు చేశారని, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. మీరు అప్పు చేసి చేసిన అభివృద్ధి పనులు ఏమిటో చెప్పండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్ర రెవెన్యూ తగ్గుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి కథలు చెబుతోందని ఎద్దేవా చేశారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్‌లో రూ.50 లక్షల విలువైన భూమిని రూ.21 లక్షలకు కేటాయించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టులో రూ.100 కోట్ల మట్టి దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ, దీని వెనుక ఎవరు ఉన్నారన్న సంగతి అందరికీ తెలుసు అని అన్నారు. రాష్ట్రంలో పత్రికా విలేకరులను కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మండల స్థాయిలో గుర్తించి వేధిస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పత్రికా విలేకరులను గౌరవించి వారికి అక్రెడిటేషన్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో మరోసారి బీఆర్ఎస్‌కు మెజారిటీ సీట్లు ఇచ్చి కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తేనే జిల్లాకు న్యాయం జరుగుతుందని, ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి సాధ్యమవుతుందని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# 'ఎస్ఐఆర్' విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

**• రానున్న 30 రోజుల్లో ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ • బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలి**

**• రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కీలక సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమంలో రానున్న 30 రోజులలో ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని తిరిగి స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో టామ్ టామ్ నిర్వహించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి తమ వివరాలను సక్రమంగా అందించాలని కోరారు. అన్‌మ్యాప్డ్ ఓటర్లు నిర్దేశించిన 11 ధృవ పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని తెలిపారు. జిల్లాలో గుర్తించిన ఎక్కువ శాతం అనామలీలను ఇప్పటికే పరిష్కరించినట్లు తెలిపారు. అవసరమైన పత్రాలు సమర్పించిన వారికి తక్కువ సమయంలోనే దరఖాస్తుల పరిష్కారం చేయనున్నట్లు అన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) వివరాలను వెంటనే అందజేయాలని సూచించారు. ప్రతి అర్హమైన ఓటరు ఓటు హక్కు కొనసాగేందుకు రాజకీయ పార్టీలు ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రతి బీఎల్‌ఏ తమ రాజకీయ పార్టీ జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఎవరి పేరు లేకపోయినా తప్పనిసరిగా అభ్యంతరం నమోదు చేయాలని, అభ్యంతరం నమోదు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమం కోసం జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు. బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేసి సమస్యలు, సందేహాలను వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట్ల బీఎల్‌వోలకు సహాయక సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, బి. జసవంత్, లింగనబోయిన సతీష్ బాబు, మంకన రమేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నర్సింహారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు ఎస్. నవీన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

● మున్సిపల్ చైర్మన్ మోహన్ కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి



**కల్లూరు, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్, మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి సంయుక్తంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును వారు నిశితంగా పరిశీలించారు. **పోషకాహారంపై అవగాహన:** ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అందిస్తున్న పోషకాహార విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ పేర్కొన్నారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. **విద్యార్థులతో కలిసి భోజనం:** భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించేందుకు చైర్మన్ మోహన్, కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి విద్యార్థులతో కలిసి కింద కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. ఆహారం రుచి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. **అధికారుల ఆదేశాలు:** పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో వండాలని, మెనూ ప్రకారం అన్ని పోషకాలు ఉన్న ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్స్ యాస నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన గోడ పోస్టర్ ఆవిష్కరన

● మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి




**కల్లూరు, జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నెల 29 ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ ఇందిరా పార్క్ లో జరిగేటువంటి తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన సభకు ఉద్యమకారులు తరలి రావాలని తెలంగాణ తొలి మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఈ నెల 29 న హైదరాబాద్ లో జరిగేటువంటి తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన గోడ పోస్టర్ ను డాక్టర్ పిడమర్తి రవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఇంచార్జ్ వలసాల మణికిషన్, పడిగల రమేష్, దుర్గారావు, బానోత్ కృష్ణ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటికి ఎంజేపీ గురుకులం మంజూరు

**బీసీ విద్యార్థుల విద్యా ప్రగతికి మరో మైలురాయి**

**రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృషి ఫలితం**

**హర్షం వ్యక్తం చేసిన పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న**



**రాయచోటి జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాయచోటి ప్రాంత విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించిందని, మహాత్మా జ్యోతిబా ఫూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాల మంజూరు కావడం బీసీ విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు గొప్ప వరమని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న పేర్కొన్నారు. ఈ నిర్ణయం గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితల దూరదృష్టితో పాటు రాయచోటి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవ ఫలితంగానే ఈ గురుకులం మంజూరైందని ఆయన తెలిపారు. ఎంజేపీ గురుకులం ద్వారా బీసీ విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి, ఆహారం, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ గురుకులం ఒక బలమైన వేదికగా నిలవనుందని అన్నారు. రాయచోటి ప్రాంత విద్యాభివృద్ధికి ఇది ఒక చారిత్రాత్మక ముందడుగని, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయంగా నిలుస్తుందని అంకన్న అభిప్రాయపడ్డారు. బీసీ విద్యార్థుల విద్యా అభివృద్ధి, సామాజిక సాధికారత కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని కోరుతూ, గురుకులం మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం మరియు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమాం హుస్సేన్ త్యాగం ప్రేరణ కావాలి



**కరీంనగర్ జూన్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** 'మొహర్రం' ఒక ప్రత్యేక ప్రాముఖ్యత కలిగినటువంటి మాసం. ఇస్లామ్ ధర్మంలో దీనికొక ప్రత్యేకత ఉంది. ఇస్లామీ క్యాలండరు ప్రకారం ఇది ముస్లిమ్ జగత్తుకు నూతన సంవత్సరం. ముహర్రం మాసంతోనే ఇస్లామీయ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. పూర్వచరిత్రలో కూడా దీనికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉండింది. ఇస్లామ్ కు పూర్వం అప్పటి సమాజంలో కూడా 'ముహర్రం' నుండే కొత్తసంవత్సరం ప్రారంభమయ్యేది. ముహమ్మద్ ప్రవక్త(స) ముహర్రం మాసాన్ని అల్లాహ్ నెల అని అభివర్ణించారు. రమజాన్ రోజాల (ఉపవాసాలు) తరువాత అత్యంత శుభప్రదమైన రోజా ఆషూరా రోజానే. అంటే ముహర్రం పదవ తేదీన పాటించబడే రోజా అన్నమాట. రమజాన్ రోజులు విధిగా (ఫర్జ్ గా) నిర్ణయించబడక పూర్వం ఆషూరా రోజాయే ఫర్జ్ రోజు గా ఉండేది. కాని రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించబడిన తరువాత ఆషూరా రోజా సఫిల్ గా మారిపోయింది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ప్రకారం, ఒకసారి ప్రవక్త మహనీయులు మదీనాకు వెళ్ళారు. ఆరోజు అక్కడి యూదులు రోజా పాటిస్తున్నారు. అది ముహర్రం పదవ తేదీ వారిని ప్రవక్త అడిగారు. ఏమిటి ఈరోజు విశేషం?' అని దానికి వారు, ఇది చాలా గొప్పరోజు. ఈ రోజే అల్లాహ్ మూసా ప్రవక్త(అ)ను, ఆయన జాతిని ఫెరౌన్ బారినుండి రక్షించాడు. ఫిరౌన్ ను, అతడి సైన్యాన్ని సముద్రంలో ముంచేశాడు. అప్పుడు మూసా ప్రవక్త, దైవానికి కృతజ్ఞతగా రోజా పాటించారు. కనుక మేముకూడా. ఆయన అనుసరణలో ఈరోజు రోజు పాటిస్తాము' అని చెప్పారు. అప్పుడు ప్రవక్తమహనీయులు, మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం అని చెప్పి, తమ అనుచరులకు, రోజా పాటించమని ఉపదేశించారు. ఆషూరా రోజా కేవలం యూదులే కాదు, క్రైస్తవులు కూడా పాటించేవారు. ఈ ఇదువర్గాలూ ముహర్రం పదవ తేదీన మాత్రమే రోజా పాటించేవి. కాని ప్రవక్తవారు, మీరు రెండురోజులు పాటించమని తన సహచరులకు బోధించారు. అంటే ముహర్రం మాసం 9,10 కాని, లేక 10,11 కాని రెండు రోజులు రోజాలను పాటించాలి. కాకతాళీయంగా 'కర్బలా" సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంత మాత్రాన ముహర్రం మాసమంతా విషాద దినాలుగా పరిగణించడం, ఎలాంటి శుభకార్యాలూ నిర్వహించక పోవడం సరికాదు. ఎందుకంటే సత్యంకోసం, న్యాయం కోసం, ధర్మంకోసం, హక్కులకోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) అమరగతి పొందారు. ధర్మయుద్ధంలో అమరుడుకావడం మానవ సహజ భావోద్రేకాల పరంగా బాధాకరం కావచ్చునేమోగాని, విషాదం ఎంతమాత్రం కాదు. ముహమ్మద్ ప్రవక్త (స) నిర్యాణం తరువాత తొలి నలుగురు ఖలీఫాలు: సారధ్యంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ జనరం జకమైన ప్రజాస్వామ్య పాలన పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వా మ్యంలో మొట్టమొదటి సూత్రం, దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు', అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభు వులు ఎంతమాత్రం కాదు. ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సచ్ఛీలత, జవాబుదారీతనం ప్రాణం లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా, ఆదర్శంగా ఉ దేవారు అధికారులు, న్యాయమూర్తులు, సేనాపతులు, అన్నిశాఖల అధికారులు ఎంతో నిజాయితీ పరులుగా, న్యాయ ప్రేమికులుగా ఉండేవారు. అనుక్షణం దైవానికి భయపడుతూ, ప్రజాసేవలో ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తపడేవారు. ప్రజలకు సమాధానం చెప్పుకునే విషయంలో కూడా వారు, 'ఎప్పుడైనా, ఎక్కడైనా తాము ప్రజలకు జవాబుదారులు మని భావించేవారు. ప్రతిరోజూ సమాజుల సమయంలో ప్రజల్ని కలుసుకొని, వారి అవసరాలు తీర్చేవారు. అవసరమైన సూచనలు, హితవులు చేసేవారు. కాని ఖలీఫాల తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి.. దైవభీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది. యజీద్ రాచరికం రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను, ఆ సూత్రాలను తుంగలో తొక్కాయి. ఈవిధంగా కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర ప్రారంభమైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) కంకణ బద్ధులయ్యారు. లక్ష్యసాధన కోసం ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోడానికి సిద్ధపడ్డారు. విలువల పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు. ప్రజాకంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొన్న క్రమంలో సంభవించిన పరిణామ ఫలితాలు ఈనాడు. మనముందున్నాయి. ఇమామ్ హుసైన్ ఇంతటి ప్రమాదాన్ని కూడా లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యాన్ని, దాని ప్రత్యేకతల్ని కాపాడుకోడానికి 'కర్బలా' సాక్షిగా ఒకవిశ్వాసి పోషించవలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆమహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అందుకే ప్రతియేటా 'మొహర్రం' పదవ తేదీన (యౌమె ఆషూరా) ఆయనగారి త్యాగాన్ని స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) అమరత్వం ఆషామాషీ మరణంకాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ధర్మసంస్థాపన, దైవప్రసన్నతే ధ్యేయంగా సాగిన సమరంలో పొందిన వీరమరణం. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం, ఏ ధ్యేయం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరుడయ్యారో మనం దాన్నుండి స్ఫూర్తిని పొందాలి. సమాజంలో ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం పోరాడి జరుగుతున్నప్పుడు, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారుతున్నప్పుడు సమాజ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామ్య ప్రియులు, న్యాయ ప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయంకోసం, ధర్మం కోసం, మానవీయ విలువల -కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పరిధిలో శక్తివంచన లేకుండా. పోరాడాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రస్తుత తరుణంలో దాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ నడుం గించాలి. విలువలప్రేమికులందరూ ఒక్కటిగా ముందుకు కదలాలి. దానికి ఇమామ్ స్ఫూర్తి ప్రేరణ కావాలి. రేపు 10వ ముహర్రం యౌమే ఆషూరా సందర్భంగా ప్రత్యేక వ్యాసమని కరీంనగర్ ఉమ్మడి జిల్లా మజ్లిస్ తహఫుజ్ ఖత్మె నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ అన్నారు.

# వచ్చేది మన ప్రభుత్వమే..





**కార్యకర్తల సంక్షేమమే నా తొలి కర్తవ్యం**

**పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం**

**పులివెందుల పర్యటనలో వైఎస్ జగన్ హామీ**

**పులివెందుల జూన్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వచ్చేది తమ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. కార్యకర్తల సంక్షేమమే తన తొలి కర్తవ్యం అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల బుధవారం రెండో రోజు పర్యటనలో పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. జిల్లా లోని నాయకులు కార్యకర్తలతో పాటు జిల్లా చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీగా వారి సమస్యలు తెలుపు కోవడానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించి వారి కష్టాలను తెలుసుకున్నారు. కూటమి నాయకుల అరాచకాలతో నష్టపోయిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రధానంగా కార్యకర్తల కష్టసుఖాలు అడుగుతూ ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని ధైర్యమిచ్చారు. కూటమి ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని, కూటమి నాయకులు దాడులు చేస్తున్నారని, అలాగే అక్రమ కేసులు పెడుతున్నారని పలువురు వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు వైయస్ జగన్ వద్ద వాపోయారు. దీనికి ఆయన స్పందిస్తూ నేను ఉన్న అంటూ భరోసా కల్పించారు. టీడీపీ ఆరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. కడప పార్లమెంటు సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డితో మాట్లాడి పరిష్కారం చూపాలని సూచించారు. రాత్రి పట్టణంలోనివాసములో బస చేస్తారు. గురువారం ఉదయం 8 గంటల కు పులివెందుల నుంచి హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు. **రోడ్డు పనులు ప్రారంభించిన జగన్** రూ .1.50 కోట్ల ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు.. రూ .50 లక్షల వ్యయంతో పులివెందుల పట్టణం లోని స్థానిక భాకరాపురం లోని త్రిలోక్ మార్ట్ నుంచి శ్రీరాముని గుడి వరకు సిసి రోడ్డు , -రూ . 50 లక్షల వ్యయంతో పులివెందుల పట్టణం లోని స్థానిక 31 వ వార్డు వైయస్సార్ కాలనీ నందు న్యాక్ బిల్డింగ్ ప్రక్కన ఉన్న ప్రధాన మార్గానికి సిసి రోడ్డు ,రూ . 50 లక్షల వ్యయంతో పులివెందుల పట్టణం లోని 14,15 వ వార్డు యర్రగుడి పల్లి లోని గరుడాల బ్రిడ్జి ప్రక్కన రేషన్ డీలర్ షాప్ మరియు సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న రోడ్డు ప్రారంభించారు.

# ఒక యూట్యూబర్ తీసిన సినిమాకు భారత్‌లో వసూళ్ల వర్షం!

హాలీవుడ్‌లో ఓ చిన్న హారర్ సినిమా బాక్సాఫీస్ వద్ద పెను సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల క్రిస్ బార్కర్ దర్శకత్వం వహించిన 'అబ్సెషన్' చిత్రం భారత్‌లో ఊహించని విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఇప్పటివరకు మన దేశంలో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2026లో అతిపెద్ద హాలీవుడ్ హిట్‌గా నిలిచింది.

కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, భారీ అంచనాలతో విడుదలైన 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' (రూ.75 కోట్లు) వసూళ్లను అధిగమించడం విశేషం. భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రాల జాబితాలో 'అబ్సెషన్' ప్రస్తుతం 28వ స్థానంలో ఉంది. మరో కోటి రూపాయలు వసూలు చేస్తే 'అవెంజర్స్: ఏజ్ ఆఫ్ అల్ట్రాన్' (రూ.80 కోట్లు) రికార్డును కూడా దాటేస్తుంది.

ఒకప్పుడు యూట్యూబర్‌గా ఉండి, దర్శకుడిగా మారిన 26 ఏళ్ల క్రిస్ బార్కర్ ఈ విజయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్‌లో తన సినిమాకు ఈ స్థాయిలో ఆదరణ లభిస్తుందని తాను ఊహించలేదని అన్నారు. ప్రేక్షకులు సినిమాలోని సన్నివేశాలను రీక్రియేట్ చేస్తూ కామెడీ వీడియోలు చేయడం, ఫ్యాన్ ఆర్ట్ గీయడం వంటివి చూసి షాక్‌కు గురయ్యానని తెలిపారు.




ఈ విజయం అల్గారిథమ్‌ల కంటే ఫిలిం మేకర్స్‌పై నమ్మకం పెంచడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు బార్కర్ పేర్కొన్నారు. యువ దర్శకులు మంచి కాంట్రాక్టులు, క్రియేటివ్ కంట్రోల్ సాధించుకోవాలని సూచించారు. కాగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 334 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.



## చరణ్‌పై మోడీ ప్రశంసలతో పులకించా

### ఎక్స్ వేదికగా చిరంజీవి ఆనందోత్సాహం

మెగాస్టార్ చిరంజీవి తన కుమారుడు రామ్ చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల 'పెద్ది' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకుని టాప్ ట్రెండింగ్‌లో ఉన్న రామ్ చరణ్ రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించారు. దీనిపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సుమతీ శతక పద్యంతో తన పోస్ట్‌ను ప్రారంభించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ'. అని రాస్తూ కొడుకు పుట్టగానే తండ్రికి నిజమైన సంతోషం కలగదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని చూసి జనాలు మెచ్చుకున్నప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు.

## వారణాసి షూటింగ్‌కు మహేశ్‌బాబు బ్రేక్

### మళ్లీ జూలై1 నుంచి పాల్గొంటారని సమాచారం

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బి జీ గా ఉ న్న



మహేష్ బాబు తాజాగా చిన్న విరామం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రీసెంట్‌గా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహేష్ బాబు తన భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి కనిపించారు. ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబంతో కలిసి కనిపించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వారణాసి' షూటింగ్‌కు మహేష్ బాబు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు స్పష్టమైంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, మహేష్ బాబు జూలై 1నుంచి మళ్లీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. వరుసగా నెలల తరబడి షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం కుటుంబంతో కొంత సమయం గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు పాత్రల గురించి వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాలో ఆయన 'రుద్ర' పాత్రలో కనిపించడమే కాకుండా, శ్రీరాముడి పాత్రలో కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్లు, అడ్వెంచర్ సన్నివేశాలు సినిమా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక ఈ చిత్రంలో 'మందాకిని' పాత్రలో కనిపించనుంది. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. ముఖ్యంగా ఈ చిత్రాన్ని పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ స్థాయి విజువల్స్, సాంకేతిక విలువలతో రూపొందుతున్న ఈ సినిమాను పలు భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లో కూడా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

--------------

## మీనాక్షి చౌదరి న్యూ ట్రావెల్ వైబ్!

: టాలీవుడ్ లక్కీ బ్యూటీ మీనాక్షి చౌదరి సోషల్ మీడియాలో నిత్యం ట్రెండింగ్‌లో ఉంటారు. తన గ్లామరస్, స్టైలిష్ లుక్స్‌తో యూత్‌ను కట్టిపడేసే ఈ ముద్దుగుమ్మ, తాజాగా తన బిజీ లైఫ్ నుంచి కాస్త బ్రేక్ తీసుకుని నేపాల్ వెళ్లారు. అక్కడ దిగిన బ్యూటిఫుల్ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ.. "నేపాల్ ఎడిషన్ బోలెడన్ని మోమోస్, గుళ్లు, మరియు సరళత్వంలోనే అందం" అంటూ క్యాప్షన్ పెట్టారు. స్టైల్‌తో పాటు ట్రెడిషన్‌ను మిక్స్ చేసిన ఆమె లేటెస్ట్ ట్రావెల్ పిక్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలు చూద్దాం.. నేపాల్ పురాతన కట్టడాల్లో మీనాక్షి సందడి: నేపాల్‌లోనే అత్యంత పురాతనమైన, పవిత్రమైన బౌద్ధ పుణ్యక్షేత్రం బ్యాక్‌డ్రాప్‌లో మీనాక్షి ఈ ఫోటోలు దిగారు. చుట్టూ దట్టమైన చెట్లు, పొడవైన రాతి మెట్లు, సాంప్రదాయ చిన్న రాతి స్తూపాలు, కలర్‌ఫుల్ బౌద్ధ ప్రార్థన జెండాల మధ్య ఆమె నడుచుకుంటూ వెళ్తున్న విజువల్స్ చాలా పీస్‌ఫుల్‌గా ఉన్నాయి. అక్కడ స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే కళాఖండాల మధ్య మోడ్రన్ ట్రావెల్ వైబ్స్‌తో మీనాక్షి ఎంతో హుందాగా కనిపించారు. ఈ టూర్‌లో మీనాక్షి వేసుకున్న డ్రెస్సింగ్ స్టైల్ ఫ్యాషన్ లవర్స్‌ను బాగా ఆకట్టుకుంటోంది. ఆమె బ్లాక్ క్రాప్ టాప్‌పై, వైట్ షార్ట్-స్లీవ్ షర్టును ష్రగ్‌లా లూజ్‌గా వేసుకున్నారు. దీనికి మ్యాచ్ చేస్తూ కింద రెడ్ అండ్ ఆరెంజ్ కాంబినేషన్‌లో ఉన్న జైపురి స్టైల్ మ్యాక్సీ స్కర్ట్ ధరించారు. ఇక ఈ ట్రెడిషనల్ స్కర్ట్‌తో పాటు తలపై ఒక క్లాసీ హెడ్‌స్కార్ఫ్, స్టైలిష్ రౌండ్ సన్‌గ్లాసెస్ పెట్టుకుని మోడ్రన్ లుక్‌కి కాస్త ట్రెడిషనల్ టచ్ ఇచ్చి అదరగొట్టేశారు.



## మాట్లాడినా..మాట్లాడకున్నా తప్పే..

### ధర్మన్ సినిమా లాంచ్‌లో రజనీకాంత్ ఆవేదన




తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి అసహనం వ్యక్తం చేశాడు నటుడు సూపర్ స్టార్ రజనీకాంత్. తాజాగా చెన్నైలో జరిగిన 'ధర్మన్' సినిమా లాంచ్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, బహిరంగంగా మాట్లాడాలంటే ఇప్పుడు భయంగా ఉందని చెప్పారు. తాను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే అవుతోందని రజినీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపైకి మాట్లాడమని పిలిస్తే భయంగా ఉందని, ఎందుకంటే తాను మాట్లాడితే అది తనకు కాకపోయినా మీకు సమస్య అవుతుందని ఆయన అన్నారు. ఒకవేళ మౌనంగా ఉంటే మౌనంగా ఎందుకు ఉన్నాడు అని ఎగతాళి చేస్తారని చెప్పారు. అదే మాట్లాడితే ఇప్పుడు ఎందుకు మాట్లాడాడు, అసలు మాట్లాడకుండా ఉండాల్సింది అని విమర్శిస్తారని తెలిపారు. ఇక చాలా ఏళ్ల తర్వాత తనకు ఒక విషయం అర్థమైందని, మనల్ని ఇష్టపడని వాళ్లకు మనం ఏం చేసినా నచ్చదని, ఇష్టపడేవాళ్లు మనం ఏం చేసినా నచ్చుతుందని అనుకోవడం మూర్ఖత్వమని రజినీ అన్నారు. ప్రతి ఒక్కరూ మనల్ని మెచ్చుకుంటారని ఆశించడం సరికాదని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రజినీకాంత్ 'ధర్మన్' చిత్ర షూటింగ్ గురువారం నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తుండగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించబోతున్నాడు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు సూపర్‌స్టార్ రజినీకాంత్ బహిరంగంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై రజినీకాంత్ స్పందించారు. 'ధర్మన్' లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివాదానికి తెరదించారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత మీడియా అడిగిన ప్రశ్నకు రజినీకాంత్ బదులిస్తూ, తామిద్దరం ఇప్పటికే వ్యక్తిగతంగా మాట్లాడుకున్నామని దీనిపై చర్చలు అవసరం లేదని తెలిపాడు. జూన్ 22న ముఖ్యమంత్రి విజయ్ 52వ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, కమల్ హాసన్, కీర్తి సురేష్, ఖుష్బూ సుందర్, మోహన్‌లాల్, త్రిష సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు బహిరంగంగా శుభాకాంక్షలు తెలిపారు. అయితే విజయ్‌కి రజినీకాంత్ విష్ చేయకపోవడంపై కొందరు ట్రోల్స్ చేయడం మొదలుపెట్టారు. గతంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు కూడా రజినీకాంత్ బహిరంగంగా స్పందించకపోవడంతో ట్రోల్‌కి గురికాగా.. మరోసారి ఆయనను టా÷-గ్గ÷ట్ చేశారు నెటిజన్లు. అయితే తాజాగా ఈ వివాదానికి ముగింపు పలికాడు రజనీకాంత్.




## 'గాసిప్' సినిమా చూడాల్సిందే

మనం సరదాగా మాట్లాడే మాటలు ఇతరుల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలియాలంటే మా 'గాసిప్' సినిమా చూడాల్సిందే' అంటున్నారు దర్శకుడు వైభవ్ కౌండిన్య. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ ప్రధాన పాత్ర పోషించగా.. యతి రేమెల్ల నిర్మించారు. రవివర్మ, మహేశ్ యడ్లపల్లి, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సాయికిరణ్ అడివి ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ.. 'మాటకు చాలా శక్తి ఉంది. ఒక మాట మనిషిని నిలబెట్టగలదు. అదే మాట అతడిని కూల్చగలదు. అందుకే ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యత ఉండాలని సందేశాన్నిచ్చే చిత్రమిది. నా జీవితంలో.. నా మిత్రుల జీవితాల్లో జరిగిన కొన్ని నిజ సంఘటనలు దీంట్లో ఉన్నాయి. ఇదొక మంచి భావోద్వేగభరిత ప్రయాణం. కచ్చితంగా అందర్నీ ఆలోచింపజేస్తుంది' అన్నారు. 'ఇది నాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఒక చిన్న గాసిప్ ఓ వ్యక్తి జీవితాన్ని ఎలా తలకిందులు చేస్తుందో చూపించే కథ. దీన్ని థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నారు నటి రాశీ సింగ్.

--------------



## శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.